క్లుప్తంగా

పోరాటాల ఫలితంగానే వేతనాల విడుదల

బాన్సువాడ: పోరాటాల ఫలితంగానే ఆస్పత్రి కార్మికులకు వేతనాలు విడుదలయ్యాయని ఏఐటీయూసీ జిల్లా నేత దుబాస్ రాములు అన్నారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, వివిధ పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆ నిరసనల ఫలితంగానే సంబంధిత మంత్రి, వైద్య విధాన పరిషత్ కమిషనర్లు స్పందించి కార్మికులకు వేతనాలు విడుదల చేశారని అన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి జుక్కల్ ఇన్‌చార్జిగా తుకారాం

పిట్లం(జుక్కల్): బీసీ రాజ్యాధికార సమితి జుక్కల్ ఇన్‌చార్జిగా ఎం.తుకారాం నియమితులయ్యారు. ఈమేరకు సమితి కామారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ కుమ్మరి యాదగిరి నియామక పత్రం అందజేశారు. పదవికి న్యాయం చేస్తానని తుకారాం అన్నారు. సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ రాజ్, కో–ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొగి పురుగుతో జాగ్రత్తగా ఉండాలి

బీబీపేట: వరికి ప్రస్తుతం సోకుతున్న మొగి పురుగుతో రైతులందరూ జాగ్రత్తగా ఉండాలని ఏఈవో రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం బీబీపేటలో వరి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం పంటలను ఆన్లైన్‌లో నమోదు చేసి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు వరి పంటను ఆరబెడుతూ నీళ్లు పెట్టాలని, వాతావరణంలోని మార్పుల వల్ల కూడా వరి పంట ఎర్రబారుతుందని అన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: మహిళా సంఘ సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సాయిలు అన్నారు. శుక్రవారం మండల సమాఖ్య భవనంలో వీవోఏల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులు సంఘంలో పొందిన రుణాల ద్వారా ఆర్థికంగా ఎదిగేలా వీవోఏలు ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంకు డీపీఎం రవీందర్‌రావ్, స్త్రీనిధి ఆర్ఎం కిరణ్, సీసీలు సాయిలు, భాగయ్య, స్వామి, రమేష్, స్త్రీనిధి మేనేజర్ సౌజన్య పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు చేపట్టాలని పిలుపు

కామారెడ్డి అర్బన్: వెయ్యి సంవత్సరాల సనాతన చరిత్ర కలిగిన కామారెడ్డి దళితవాడలోని శ్రీకోదూరి అంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ దీక్షలు చేపట్టడానికి భక్తులు ముందుకు రావాలని వేదపండితులు జి.అంజనేయశర్మ పిలుపునిచ్చారు. ఈ నెల 23న ఆదివారం నుంచి దీక్షాపరులు ఆలయం వద్ద శుభ్రం చేయడం, సదుపాయాలు, దీక్షావస్త్రాలు, వస్తువుల స్వీకరణ ఉంటుందని, మార్చి 3న ఉదయం నుంచి దీక్షలు ప్రారంభమవుతాయని వేదపండితులు పేర్కొన్నారు.

ఘనంగా షాబాషావాలి దర్గా ఉర్సు

ఎల్లారెడ్డి: పట్టణంలోని షాబాషావాలి దర్గా ఉర్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకుల ఇంటి నుంచి షాబాషావాలీ దర్గాకు సమర్పించేందుకు సందల్‌తో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం దర్గాలో సందల్, చాదర్‌ను సమర్పించారు. అనంతరం ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లిలో గ్రామాభివృద్ధి కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివగౌడ్, ఉపాధ్యక్షుడిగా పసుపు రాజు, కార్యదర్శిగా సుంకరి సాయిలు, కోశాధికారిగా మున్నూరు గోపి, కమిటీ సభ్యులుగా లింగారావు, హనుమంత్ రావు, రాములు, మధుసూదన్, మూర్తి, వడ్ల శ్రీను, చాకలి సాయిలు, భాస్కర్, గంగారాం, రాజేందర్‌లు ఎన్నికయ్యారు. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిరూరల్: ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. డీఈ విజయసారథి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించి కంచెను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

బస్తీ దవాఖానా సేవలను వినియోగించుకోవాలి

ఎల్లారెడ్డి: బస్తీ దవాఖానా సేవలను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిణి పద్మజ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటలోని బస్తీ దవాఖానాలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించి మాట్లాడారు.

అభివృద్ధి పనుల పేరిట దోపిడీ



ప్రొక్లెయిన్‌తో టిప్పర్లలోకి ఇసుకను నింపుతున్న దృశ్యం

దర్జాగా ఇసుక అక్రమరవాణా
- 50 ట్రాక్టర్లకు అనుమతి తీసుకుని 300 ట్రాక్టర్ల వరకు ఇసుక రవాణా
- చించొల్లి, బీర్కూర్, బరంగేడ్గి మంజీర ప్రాంతాల నుంచి తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీసు యంత్రాంగం

బాన్సువాడ : అభివృద్ధి పనుల పేరిట ఇసుక టిప్పర్లు అడ్డదారి తొక్కుతున్నాయి. నిత్యం దర్జాగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ డివిజన్‌లోని చించొల్లి, బీర్కూర్, బరంగేడ్గి, బిచ్కుంద మండలంలోని హస్గుల్, పుల్కల్ గ్రామాల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఏదో ఒక విధంగా రవాణా కొనసాగుతూనే ఉంది. పొద్దంతా ట్రాక్టర్లలో డంపు చేసి రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లలో ఇతర ప్రాంతాలను ఇసుకను తరలిస్తున్నారు. బీర్కూర్ మండలంలోని చించొల్లి, నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని ఓ క్రషర్ వద్ద పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో ఇసుకను డంప్ చేసి అక్కడి నుంచి తరలిస్తున్నారు. నస్రుల్లాబాద్ మండలానికి చెందిన ఓ యువ నాయకుడు ఇసుక అక్రమ దందా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నాగమడుగు చెక్‌డ్యాం నిర్మాణం పేరిట ఇసుకను నిజామాబాద్, హైదరాబాద్, కామారెడ్డి, నారాయణ్‌ఖేడ్, సంగారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాలకు టిప్పర్లలో తరలిస్తున్నారు. 40 నుంచి 50 ట్రాక్టర్లకు అనుమతి తీసుకొని సుమారు 250 నుంచి 300 ట్రాక్టర్లు తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పుల్కల్, హస్గుల్ మంజీర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హస్గుల్ నుంచి మద్దెల్‌చెరువుకు అనుమతి తీసుకుని కర్ణాటకకు తరలిస్తున్నారు.



హస్గుల్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ..

లోకల్ వాహనాలకు టోల్ వసూలు చేయవద్దు

భిక్కనూరు : మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న తేలిక వాహనాలకు భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద పన్ను వసూలు చేయకుండా మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మండల తేలికవాహనాల యజమానులు, డ్రైవర్లు శుక్రవారం భిక్కనూరు టోల్‌ప్లాజా ఇన్‌ఛార్జికి వినతి పత్రం అందజేశారు. టోల్‌ప్లాజా భిక్కనూరులో ప్రారంభమై పదేళ్లు పూర్తయిందని.. ఇప్పటివరకు లోకల్ వాహనాలకు టోల్ పన్నులు తీసుకోలేదని.. ఇప్పుడు కూఆ తీసుకోవద్దని వారు కోరారు. రాష్ట్రంలో అన్ని టోల్‌ప్లాజాల వద్ద అక్కడి లోకల్ వాహనాలకు టోల్ తీసుకోవడం లేదని కొత్తగా భిక్కనూరులో శుక్రవారం నుంచి పన్నులు తీసుకోవడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



వినతి పత్రం అందజేస్తున్న తేలిక వాహనాల యజమానులు, డ్రైవర్లు

నేడు నిరసన

భిక్కనూరు : లోకల్ వాహనదారులకు టోల్ పన్ను చెల్లించాలని నూతన టోల్ కాంట్రాక్టు సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నందుకు వ్యతిరేకంగా నేటి ఉదయము 10 గంటలకు టోల్ ప్లాజా వద్ద నిరసన కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ తెలిపారు. భిక్కనూరు పరిసర ప్రాంతాల ప్రజలు నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలి

కామారెడ్డి రూరల్: విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్(ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ) వాడుతూ పాఠాలు బోధించడం వల్ల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చవచ్చని ఎంఈవో ఎల్లయ్య సూచించారు. శుక్రవారం గర్గుల్ కాంప్లెక్స్‌లో ప్రాథమిక పాఠశాల స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల ఉపాధ్యాయులు ఆన్లైన్ వర్కులని పూర్తి చేయాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కిట్‌పై అవగాహన కల్పించారు. గర్గుల్ కాంప్లెక్స్ సెక్రెటరీ శంకర్, రాములు, సీఆర్‌పీలు కాళిదాస్, చిరంజీవి, బాలయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో ఎల్లయ్య

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై షీటీం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థులు.. తల్లిదండ్రులకు సంబంధించిన ఫోన్లకు ఏదైనా ఫోన్లు వచ్చినప్పుడు ఓటీపీ నెంబర్లు చెప్పాలని, బ్యాంకు ఏటీఎం బ్లాక్ అయిందని సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తారని వారికి ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని అన్నారు.

మహా కుంభమేళాలో ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం



కామారెడ్డి అర్బన్ : ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో 19వ సెక్టార్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ లక్ష మందికి ఉదయం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానం, పండ్లు, ప్రసాదం దానం చేస్తున్నట్లు కామారెడ్డి సెంటర్ ఇన్‌ఛార్జి వెంకటదాసు ప్రభు తెలిపారు. శుక్రవారం ప్రయాగ్‌రాజ్ నుంచి ఆయన మాట్లాడారు. 19వ సెక్టార్‌లోని ఇస్కాన్ కేంద్రంలో జగన్నాథ శుభ మంగళ హారతి, ఆధ్యాత్మిక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భగవద్గీత పుస్తకాలను రూ.20కే అందజేస్తున్నట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో పేరుకుపోయిన చెత్త



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వారం రోజులుగా చెత్త పేరుకుపోయింది. మార్చురీ గది పక్కన వేసిన తడి పొడి చెత్త దుర్గంధం వెదజల్లుతోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, బంధువులు ఈ దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి, మున్సిపల్ అధికారుల మధ్య సఖ్యత లోపించినట్లు తెలుస్తోంది. ఆస్పత్రి అధికారులు స్పందించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



లింగంపేట(ఎల్లారెడ్డి): సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా మాలోత్ తండాలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు రమేశ్, రవీందర్‌లు బహుమతులు అందజేశారు. 36 జట్లు పోటీల్లో తలపడ్డాయి. మొదటి బహుమతి పిట్లం జట్టుకు రూ.16,888 నగదు బహుమతితో పాటు మెమెంటో అందజేశారు. ద్వితీయ బహుమతి పర్మళ్ల తండా జట్టుకు నగదు బహుమతి రూ.8,888 మెమెంటో అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫియొద్దీన్, గణేశ్, ప్రకాష్, తండావాసులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం వాయిదా

ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లి రైతు వేదికలో శనివారం నిర్వహించనున్న పోలింగ్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎంపీడీవో లక్ష్మి శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం వాయిదా వేశామన్నారు.

వందశాతం ఫలితాలు సాధించేలా కృషి



ఎల్లారెడ్డిరూరల్: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా బోధన చేయాలని అన్నారు.

ఫిజియోథెరపి క్యాంపు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ కమల్ కిశోర్ మాట్లాడుతూ..వైద్యురాలు సారిక 9 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు చిన్నారులు ఇంటి వద్ద చేసే వ్యాయామం గురించి వివరించారు.

ఆధ్యాత్మికం..

బద్ది పోచమ్మ బోనాల పండుగ



బాన్సువాడ రూరల్: హన్మాజీపేటలో శుక్రవారం నాయకపోడు సేవాసంఘం ఆధ్వర్యంలో బద్దిపోచమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. నాయకపోడు కులస్తులు బోనాలను బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం

దోమకొండ: ముత్యంపేటలోని ఎల్లమ్మ ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. రేణుకాదేవి సిద్ధయోగ 61వ వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించడానికి ఆలయకమిటీ ప్రతినిదులు ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి ఈ నెల 19 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్ధాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

ప్రారంభమైన అంబరీశ్వర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామ స్టేజీ వద్ద గల అంబరీశ్వర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గుడిమేట్ పీఠాధిపతి మహదేవ్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం నుంచి నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ప్రారంభించనున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పుల్వామా దాడిలో అమరులకు ఘన నివాళి



భిక్కనూరు: పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్లకు భిక్కనూరు మండల కేంద్రంలో సిద్దరామేశ్వర ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. వారి ఆత్మ శాంతి కోసం 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎస్సై అంజనేయులు, మండల ట్రాలీ ఆటో యూనియన్ అధ్యక్షుడు బండి సత్యనారాయణ, ప్రతినిధులు బత్తుల నాగరాజు, పిట్ల నవీన్, బల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో క్యాండిల్ ర్యాలీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో కేంద్ర సాయుధ బలగాల మాజీ సిబ్బంది శుక్రవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పుల్వామా దాడిలో అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. లింబేష్ తదితరులున్నారు.

ఘనంగా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి, నిజామాబాద్ బీజేపీ ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాలు హాజరయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి సన్మానించారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ పూర్వ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. పట్టణ అధ్యక్షుడిగా మొగిపల్లి భూమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలాజీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని 32 ఆర్యవైశ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పరిశ్రమలు నెలకొల్పాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : తెలంగాణలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో పెట్టుబడులు పెట్టి, అంతర్జాతీయ పరిశ్రమలు నెలకొల్పాలని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ వైన్ ఓవెన్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్‌లో జుక్కల్ ఎమ్మెల్యే నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దంపతులు ఘనస్వాగతం పలికి, విందుభోజనం ఏర్పాటు చేశారు. త్వరలోనే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని గారెత్, హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారి వెంట సలహాదారు నళిని, జుక్కల్ ఎమ్మెల్యే సతీమణి తోట అర్చన తదితరులున్నారు.



బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ వైన్ ఓవెన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయరూ..



బాన్సువాడ : మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ దృష్ట్యా అంబేడ్కర్ చౌరస్తా, బీసీ హాస్టల్ రోడ్డు, తాడ్కోల్ చౌరస్తా కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపారు. ఒక్క అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాత్రమే ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేసి మిగతా తాడ్కోల్ చౌరస్తా, బీసీ హాస్టల్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయడంలో తాత్సారం ప్రదర్శిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిత్యం ఏదో ఓ చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. వారాంతపు సంత రోజు మాత్రం తాడ్కోల్ చౌరస్తా వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఆటోలు సైతం రోడ్డుపై నిలుపుతున్నారు. అధికారులు స్పందించి తాడ్కోల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



తాడ్వాయిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



మద్నూర్‌లో..

కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న యూపీఎస్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో వచ్చే నెల 2న నిర్వహించనున్న యుద్ధభేరి కార్యక్రమానికి ఉపాధ్యాయులు అందరూ తరలి రావాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా తాడ్వాయి, మద్నూర్, గాంధారి మండలాల పరిధిలోని పాఠశాలల్లో యుద్ధభేరి పేరుతో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నేతలు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు.

–తాడ్వాయి/మద్నూర్/గాంధారి



గాంధారిలో..

న్యాయమూర్తిపై దాడి బాధాకరం



బిచ్కుంద(జుక్కల్): మహిళా న్యాయమూర్తిపై ఒక ముద్దాయి కోర్టులో దాడికి పాల్పడినందుకు నిరసనగా శుక్రవారం బిచ్కుంద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది మల్లేశ్వర్ మాట్లాడుతూ.. ముద్దాయి కోర్టులో న్యాయమూర్తిపై దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. పోలీసులు అన్ని విధాలుగా న్యాయమూర్తులు, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. బార్ అధ్యక్షుడు ప్రకాష్ పటేల్, న్యాయవాదులు మల్లేశ్వర్, శివాజీ, మహ్మద్, శంకర్‌రావు పటేల్, రాజు దేశాయి తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై విద్యార్థులకు వర్క్‌షాప్



కామారెడ్డి అర్బన్: మండలంలోని చిన్నమల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం హైదరాబాద్ సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికుల సంఖ్య లెక్కించడం, ఆస్పత్రిలో మంచంపై ఉన్న రోగులు లేవకుండానే లైట్లు ఆన్ ఆఫ్ చేయడం వంటి అంశాలపై విద్యార్థులతో చేయించారు. ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ ప్రతాప్ రెడ్డి, రోబోటిక్స్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్, సహాయకులు దివ్య తదితరులు పాల్గొన్నారు.